ప్రజాశక్తి
శనివారం 2 డిసెంబర్ 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





రైతుల్లో తుపాను భయం

◆ తడితోనే పొలాల్లో వరి కుప్పలు ◆ ధాన్యం నాణ్యత పోతుందని ఆందోళన
◆ కోత వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ సూచన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రైతులను తుపాను భయం వెంటాడుతోంది. భారీ వర్షాలు పడితే కోసిన వరి చేతికి రాకుండా పోతుందని వారు వాపోతున్నారు. కోసిన వరిచేనును వాతావరణ శాఖ హెచ్చరికతో తడితోనే అక్కడక్కడా పొలాల్లో కుప్పలు వేస్తున్నారు. ఎండకుండా కుప్పలు వేస్తే ధాన్యం ముక్కి చేను కుళ్లిపోతుంది. అందుకని కొంతమంది రైతులు తడితో కుప్పలు వేయడానికి భయపడుతున్నారు. బాగా పండిన చేను కోయకపోతే వరి వెన్ను రాలిపోతుందని మేఘాలు చూసుకొని కోస్తున్నారు. ఏదేమైనా ఈ ఏడాది రైతుకు వరి తీవ్రమైన బాధను మిగిల్చేలావుంది.



దేవరాపల్లిలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

ఈసారి వరి పంట వేయాల్సిన కాలంలో వర్షాలు ఎడపెట్టాయి. దీంతో జలాశయాల కింద పూర్తిస్థాయిలో వరి సాగుచేయలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 24 మండలాల్లో 16 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షాలకు ఉడుపులు చేసిన తరువాత వర్షాలు ఎడపెట్టడంతో 15 వేల ఎకరాలకు పైగా పంట ఎండిపోయింది. అయినా కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించలేదు. బోర్లు, బావులు, జలాశయాల కింద సాగుచేసుకున్న వరి పంట చేతికొస్తున్న సమయంలో భారీ వర్షాలు రానుండడంతో ఈ పంటా ఇంటికొచ్చేలా లేదు. బంగాళ ాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా మారి ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పండిన వరి కోతలను రైతులు ఆపేశారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,36,460 ఎకరాల్లో వరి సాగు కావాల్సివుంది. 1,10,765 (81 శాతం) ఎకరాల్లో నమోదైంది. వరి కోతలు ముమ్మరమవుతున్న ఈ సమయంలో భారీ వర్షాలు కురవనుండడంతో రైతు కంట కునుకు కరువైంది. నిన్నటి వరకూ వర్షాల్లేక పంట వేయలేకపోయామని రైతులు బాధపడగా ఇప్పుడు వేసిన పంట చేతికి రాదన్న భయంతో వున్నారు. జిల్లాలోని దేవరాపల్లి, చీడికాడ, సబ్బవరం, కె.కోటపాడు, వి.మాడుగుల, ఇతర మండలాల్లో ఐదు వేల ఎకరాల వరి పంట మిగతా 2లో..

తుపాను సహాయ కార్యక్రమాలకు

తూర్పు నావికాదళం సిద్ధం

- నేవీ డే వేడుకలు 10కి వాయిదా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం భారీ తుపాను 'మైచాంగ్'గా బలపడి ఉత్తర తమిళనాడు - ఆంధ్రప్రదేశ్ మధ్య ఈ నెల 3, 4 తేదీల్లో తీరం దాటే అవకాశమున్నందున విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తూర్పు నావికాదళం సిద్ధమైంది. ఇప్పటికే కమాండ్ సిబ్బందిని అవసరమైన విపత్తు సహాయ కార్యకలాపాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంచామని నావికా దళ ఉన్నతాధికారులు తెలిపారు. తక్షణ సహాయం కోసం విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ డేగా, చెన్నయ్ సమీపంలోని ఐఎన్ఎస్ రాజాలి వద్ద భారత నావికాదళ నౌకలు, విపత్తు సహాయ డైవింగ్ బృందాలు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. అవసరం మేరకు ఏరియల్ సర్వే, క్యాజువాలిటీ తరలింపు, సహాయక సామగ్రిని ఎయిర్‌డ్రాప్ చేయడానికి నావల్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

నావికాదళ దినోత్సవ సంబరాలు వాయిదా

ఇండియన్ నేవీ ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా మాదిరిగానే ఈ నెల 4న ఆర్‌కె బీచ్‌లో తలపెట్టిన నేవీ డే వేడుకలు తుపాను కారణంగా వాయిదా పడినట్టు కమాండ్ రెజిమెంట్ సిస్టమ్ ఆఫీసర్ సరుప్ బెనర్జీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 2న నిర్వహించాల్సిన ఆపరేషన్ డెమో ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ ఈ నెల 8కి, 4న నిర్వహించాల్సిన నేవల్ ఆపరేషనల్ డిస్‌ప్లే ఫైనల్ డెమో 10వ తేదీకి వాయిదా పడ్డట్టు వెల్లడించారు. ఇప్పటికే వీటి కోసం పాస్‌లు పొందిన వారు ఆయా తేదీల్లో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

స్థాయీ సంఘంలో 34 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరిగింది. ప్రధాన అజెండాలో 25 అంశాలు, టేబుల్ అజెండాలో 9 అంశాలు పొందుపరచగా అన్నీ అమోదించబడ్డాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.664.3 లక్షల అభివృద్ధి పనులకు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు మిగతా 2లో..

ఎయిడ్స్‌పై అవగాహన, అప్రమత్తత అవసరం

▶ వార్త 6లో..

మద్యం దుకాణం వద్దని ఆందోళన

▶ వార్త 2లో..

డంపింగ్ యార్డ్ ఎత్తేయాలని ధర్నా

▶ వార్త 3లో..



మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

30, 31 తేదీల్లో..

'ప్రపంచీకరణ-ఉపాధి'పై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మికోద్యమ నిర్మాతల్లో ఒకరైన సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక కార్యదర్శి నండూరి ప్రసాదరావు 22వ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా 'ప్రపంచీకరణ - ఉపాధి' అన్న అంశంపై జాతీయ సదస్సును ఈ నెల 30, 31 తేదీల్లో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. శుక్రవారం జగదాంబ దరి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ హాజరవుతారని వెల్లడించారు. నవంబరు 29 నండూరి ప్రసాదరావు వర్ధంతి రోజు నుంచి డిసెంబరు 29 వరకూ వివిధ పరిశ్రమల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు నిర్వహించి 30, 31 తేదీల్లో జాతీయ సదస్సు తలపెట్టామన్నారు. దేశంలో 1990 నుంచి అమలు చేస్తున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, మిగతా 2లో..

ఉక్కునగరంలో బాలల పండగ

◆ ఆకట్టుకున్న కళారూపాలు ◆ వందలాది మంది చిన్నారులు హాజరు

ప్రజాశక్తి - ఉక్కునగరం

ఉక్కునగరం అంబేద్కర్ కళాక్షేత్రంలో జ్యోతి బాలవిహార్ ఆవరణలో విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఉక్కునగరం చిల్డ్రన్స్ ఫెస్టివల్ వేలాది మందితో తొలిరోజైన శుక్రవారం అబ్బురపరిచింది. కళారూపాలు వీక్షకులను కట్టిపడేశాయి. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి వారి వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. స్టీల్‌ప్లాంట్ జిఎం ఎం.మధుసూదన్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉక్కునగరంలో ఇన్ని వేల మందితో పిల్లల పండగ ప్రారంభం కావడం అభినందించాల్సిన విషయమన్నారు. పిల్లలు చదువుతో పాటు విజ్ఞానం, వినోదం, ఆటల మధ్య



ఉక్కునగరం చిల్డ్రన్స్ ఫెస్టివల్ ప్రారంభ వేడుకకు హాజరైన అతిథులు



నృత్యంతో ఆకట్టుకున్న విద్యార్థిని

మరింత చురుగ్గా తయారవుతారని తెలిపారు. పిల్లల్లో దేశభక్తి, అభ్యుదయ భావాలు, శాస్త్రీయ విలువలు పెంచే ఇలాంటి కార్యక్రమాల వల్ల వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. మరొక అతిథి గాజువాక మండల విద్యాశాఖ అధికారి ఎం.సునీత మాట్లాడుతూ విద్యార్థులు రాణించాలంటే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రైతుల్లో తుపాను భయం

రైతులు కోసినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో కొంత వరకు వరి కుప్పలు వేశారు. అత్యధిక భాగం కుప్పలు వేయాల్సివుంది. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులను వ్యవసాయశాఖాధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఈ నెల నాలుగు నుంచి ఆరు వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని, వరి పంట కోయెద్దని సూచిస్తున్నారు. కోసిన వరి పొలాల్లోవుంటే కుప్పలు వేయడంగానీ, నూర్చడంగానీ చేయాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. బాగా పక్వానికి వచ్చి గింజరాలే దశలో వున్న వరి పైరును మెషిన్‌తో కోసుకోవాలన్నారు. తక్షణమే పైరును త్రషర్ ద్వారా నూర్చుకొని మూడో తేదీలోపు ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశంలో నీడలో ఆరబెట్టుకొని జాగ్రత్త చేసుకోవాలన్నారు. నాలుగు నుంచి భారీ వర్ష సూచన ఉన్నందున ఆరు వరకు కోతను వాయిదా వేసుకోవాలన్నారు. చెరుకు గాలులకు పడిపోకుండా జడ చుట్లు వేసుకోవాలని ఆయన తెలిపారు.

స్థాయీ సంఘంలో 34 అంశాలు ఆమోదం

కార్యక్రమాలకు అదనపు కార్మికులను తాత్కాలిక సేవల నిమిత్తం ఉపయోగించుకున్నందుకు, ఇతర కార్యక్రమాల కోసం రూ.97.82 లక్షలు, యుసిడి విభాగానికి సంబంధించి ఎకో వైజాగ్ కార్యక్రమం, సామగ్రి సరఫరా కోసం రూ.3.88 లక్షలు వెచ్చించుటకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, యుసిడి పీడీ పాపునాయుడు, కార్యదర్శి పి.నల్లనయ్య పాల్గొన్నారు.

ఉక్కునగరంలో బాలల పండగ

వారు విజ్ఞాన, వైజ్ఞానిక కార్యక్రమాలలోనూ చురుగ్గా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థీ అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ఇలాంటి కార్యక్రమాలను మరింత మంది చొరవ తీసుకొని నిర్వహించాలని కోరారు. ఉక్కునగరం 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా అన్ని రంగాల్లోనూ చురుగ్గా ఉన్నప్పుడే వారి భవిష్యత్తు ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని తెలిపారు. విసిసి చేస్తున్న సేవలను మరింత విస్తృత పరచాలని కోరారు. విసిసి కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ 74 ఈవెంట్స్‌లో సుమారు రెండు వేల మంది పిల్లలు పాల్గొంటున్నారని తెలిపారు. ఉక్కునగరం, స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లోగల విద్యాసంస్థల నుంచి విద్యార్థులు వచ్చి ఈ రెండు రోజులపాటు ఈవెంట్స్‌లో పాల్గొంటారని చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, అనేకమంది ప్రముఖులు ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బి.పద్మావతి (జాయింట్ సెక్రటరీ ఆఫ్ డిస్టిక్ మాస్టర్ అథర్స్), డి.మధుసూదన్ రావు (మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షులు), ఇ.లోకేష్ (కోఆపరేటివ్ డైరెక్టర్), కె.విమల (78వ వార్డు మాజీ కార్పొరేటర్), రేణుక ప్రసాద్ (సత్యసాయిబాబా ట్రస్ట్), కెవి.ప్రసాద్ (జనవిజ్ఞాన వేదిక) పాల్గొన్నారు. నిర్వాహకులుగా టీనా, సుమలత, సుమతి, పద్మ, అంబిక వ్యవహరించారు.

'ప్రపంచీకరణ-ఉపాధి'పై జాతీయ సదస్సు

సరళీకరణ విధానాల వల్ల ప్రభుత్వ రంగం నిర్వీర్యమవుతోందని తెలిపారు. ఉపాధి తగ్గుతోందని, సామాజిక న్యాయం కొరవడుతోందని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెయ్యి రోజులకుపైగా ఉద్యమం కొనసాగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను మోడీ సర్కారు తీసుకొచ్చిందని, ఫిక్స్‌డ్‌టెర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఉపాధికి రక్షణ లేకుండా చేస్తోందని అన్నారు. ఈ విధానాలపై చర్చించేందుకు ఈ జాతీయ సదస్సు దోహదపడుతుందని, దీనికి దేశవ్యాప్తంగా వివిధ రంగాలు, సంస్థల నుంచి 700 మంది కార్మిక ప్రతినిధులు హాజరౌతున్నారని తెలిపారు. అతిథులుగా ప్రభాత్ పట్నాయక్‌తో పాటు సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత, కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, పలువురు మేధావులు, అభ్యుదయవాదులు హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, కార్యదర్శులు పి.మణి, బి.జగన్ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని 32వ వార్డు అల్లిపురం నేరెళ్ల కోనేరు రోడ్డులో జనావాసాలు, గుడి, బడిలకు దగ్గరగా మద్యం దుకాణం పెట్టకూడదని స్థానిక ప్రజలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఇప్పటికే ఈ ఏరియాలో రెండు దుకాణాలు ఉన్నాయని, ఇప్పుడు మూడోది పెట్టి ఈ ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని నినాదాలు చేశారు. జనసేన నాయకులు తెలుగు అర్జున్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దిశ దివ్యాంగ్ సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోనే మొదటిసారిగా దిశ దివ్యాంగ్ సురక్ష పేరిట సరికొత్త కార్యక్రమాన్ని విశాఖ నగరంలో ప్రవేశపెడుతున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన దిశ దివ్యాంగ్ సురక్ష కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యర్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మాట్లాడారు. అంధులు, మూగ చెవిటివారితో పాటు ఇతర వికలాంగులూ ఈ దిశ దివ్యాంగ్ సురక్ష యాప్ ద్వారా సహాయం పొందవచ్చన్నారు. నగర పరిధిలో ఆపదలో ఉన్నట్లయితే 7337324466 నెంబరుకు ఫోన్ చేసినట్లయితే క్షణాలలో పోలీసులు వారిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం సురక్ష ప్రోగ్రామ్ సీడీని ఆవిష్కరించారు.

ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల టాలెంట్ షో

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇంటర్నేషనల్ డిజబిలిటీ డేని పురస్కరించుకొని శుక్రవారం రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో విభిన్న ప్రతిభావంతుల టాలెంట్ షోను లయన్స్ క్లబ్ విశాఖపట్టణం, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇది ఎంతో ఉత్సాహంగా సాగింది. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ ఎ.గోపాలరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఇదే ప్రాంగణంలో చిల్డ్రన్స్ డే జరిగిందని, ఇప్పుడు విభిన్న ప్రతిభావంతులకు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ప్రపంచంలో 13 కోట్ల మంది, మన దేశంలో 2.2 శాతం మంది వైకల్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకొని రావడం కోసం ప్రభుత్వం,



కళారూపాలతో ఆకట్టుకున్న విభిన్న ప్రతిభావంతులు



హాజరైన అతిథులు

ప్రభుత్వేతర సంస్థలు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిడెన్ స్ప్రౌట్స్, లెబెన్ షెల్ఫ్, సన్ ఫ్లవర్ స్కూల్, ధాన్ ఫౌండేషన్, ప్రజ్వల వాణి వెల్ఫేర్ సొసైటీ, పావని స్కూల్, పలు సంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. డ్రాయింగ్, పాటలు, ఫ్యాన్సీ డ్రెస్, డ్యాన్స్, ఉపన్యాసం, విచిత్ర వేషధారణ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సృజనాత్మకతకు అద్దం పట్టేలా ప్రదర్శనలు జరిగాయి. ఇన్నర్ వీల్ క్లబ్‌కు నాయకులు విజయలక్ష్మి, రమా విద్యాసాగర్ సహకారం అందించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ ఎంవిఎన్ దుర్గాప్రసాద్, ప్రెసిడెంట్ లయన్ ఎంఎం.మహేష్, సెక్రటరీ వివిఎన్.నాయుడు, జిఎస్‌వి.మాణిక్యాలరావు, డి. ప్రసాదు రాజు, ధాన్ ఫౌండేషన్ హెల్త్ కో ఆర్డినేటర్ కె.మురళీ కృష్ణారావు, హిడెన్ స్ప్రౌట్స్ శ్రీనివాసరావు, లెబెన్ షెల్ఫ్ వేణుగోపాల్ రెడ్డి, పిడబ్ల్యుఎస్ అలివేలు, మైథిలి సన్ ఫ్లవర్ స్కూల్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ నుంచి ఎ. మణి, కల్యాణి, భవాని పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధిత చిన్నారులతో..

కలెక్టర్ కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అందరూ పెద్ద మనసుతో ముందుకు రావాలని, గతంలో మాదిరిగానే ఈ ఏడాదీ సంజీవని సంక్షేమ నిధికి విరాళాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఎయిడ్స్ డే సందర్భంగా వైద్యారోగ్య, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. గత ఏడాది తన పిలుపు అందుకొని చాలా మంది ఉద్యోగులు ముందుకు వచ్చి విరాళాలు అందించారని, రూ.17 లక్షలు సమకూరాయని, వాటితో ఎంతో మందికి వివిధ రూపాల్లో సహాయం అందించామని తెలిపారు. 512 మందికి ఇన్సూరెన్స్ చేయించామని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా ఎయిడ్స్ డేను పురస్కరించుకొని వైద్యారోగ్య శాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు, ఎయిడ్స్ బాధిత చిన్నారులతో కలిసి కలెక్టర్ కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్ చేశారు. సందడి వాతావరణం నడుమ అల్పాహారం తీసుకున్నారు.

నేడు ఆర్‌ఎస్ బ్రదర్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని పలు నగరాల్లో తన సేవలతో గుర్తింపు తెచ్చుకున్న ఆర్‌ఎస్ బ్రదర్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ విశాఖపట్నంలోని జగదంబ సెంటర్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్, విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి. సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు హాజరుకానున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు భంగం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం వల్ల రిజర్వేషన్లు లేకుండా పోతాయని, అదే జరిగితే దళితులకు, గిరిజనులకు, మహిళలకు, బిసిలకు ఉపాధి లేకుండా పోతుందని సిఎఫ్‌టియుఐకు చెందిన సంప్రదాయ మత్స్యకారుల యూనియన్ జిల్లా నాయకురాలు కె.లక్ష్మి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 973వ రోజుకు చేరాయి.

డంపింగ్ యార్డ్ ఎత్తేయాలని ధర్నా



డంపింగ్ యార్డ్ వద్ద ధర్నా చేస్తున్న పోరాట కమిటీ నేతలు, బాధితులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు రామచంద్రనగర్ గ్రామానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 16 బాధిత గ్రామాల ప్రజలు యార్డ్ గేటు దగ్గర శుక్రవారం ఉదయం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ సలహాదారులు 76వ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైసిపి నేతలు మంత్రి శంకర్ నారాయణ, రంబ నారాయణమూర్తి.. జనసేన నేత ఎం.మురళి, సిపిఎం నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్‌తో 16 గ్రామాలకు ప్రజలు అవస్థలు, అనారోగ్యం పాలౌతు న్నామని, వెంటనే వేరేచోటుకు తరలించాలని మూడేళ్ళుగా బాధితులు నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా అధికారులు, పాలకులకు పట్టకపోవడం దుర్మార్గమన్నారు. డంపింగ్ యార్డ్ దెబ్బకు సొంతిళ్లు ఉన్నా అనేక మంది నివాసముండే పరిస్థితి లేదని, బంధుమిత్రులెవరూ చుట్టపుచూపుకైనా ఆయా గ్రామాలకు రావడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డును తరలించకుంటే, భవిష్యత్‌లో 16గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను సమాయత్తం చేసి పెద్దఎత్తున ఆందోళన నిరసన నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు కార్యక్రమంలో గాంధీనగర్ అసోసియేషన్ అధ్యక్షులు రామునాయుడు, టెంట్ సత్యనారాయణ, రామచంద్ర నగర్ అధ్యక్షులు బలగ రామారావు, డి రమణ, కమలాకర్, స్వతంత్రనగర్ మహిళానేతలు లక్ష్మీ, శ్రీదేవి, బర్మా కాలనీ నాయకులు సత్యారావు, రిక్షా కాలనీ నాయకులు రాజారావు అప్పారావు, బాధిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు..

త్వరితగతిన థీమ్ పార్కుల నిర్మాణం

జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ



అధికారులకు సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి రెండోజోన్ పరిధిలో నూతనంగా చేపడుతున్న థీమ్ పార్కుల పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తేవాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధురవాడ పిఎం.పాలెం ఆఖరి బస్‌స్టాప్ వద్ద వున్న యోగా థీమ్ పార్కును, బక్కన్నపాలెం లచ్చిరాజు లేఅవుట్‌లో స్పోర్ట్స్ పార్కును, మధురవాడ ఉజ్వల హాస్పిటల్ దరి ఎమ్మెస్సార్ లేఅవుట్‌లో పార్కును, గొల్లల ఎండాడ వైఎల్‌పి. లేఅవుట్ లోని ఫామ్ గార్డెన్ థీమ్ పార్కును అధికారులతో కలిసి పరిశీలించారు. పిఎం.పాలెం యోగాథీమ్ పార్కులో తక్కువ వ్యయనిర్వహణతో కూడిన మొక్కలను నాటి, సంరక్షించాలని, యోగాసనాలతో కూడిన బొమ్మల ఏర్పాటు, పాదచారులకు ఇబ్బంది కలగకుండా పార్కు చుట్టూ రోడ్డుపై అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. బక్కన్నపాలెం లచ్చిరాజు స్పోర్ట్స్ పార్కును పరిశీలించి పార్కులో షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ స్పోర్ట్స్ కోర్టు పనులను పూర్తి చేయాలని, కబడ్డీ కోర్టుకు బదులుగా ఆ ప్రదేశంలో పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని సూచించారు. మధురవాడ ఉజ్వల హాస్పిటల్ దరిఎమ్మెస్సార్ లేఅవుట్ పార్కులో మొక్కలను నాటి పచ్చదనం పెంపొందించాలని ఆదేశించారుగొల్లల ఎండాడ వైఎల్‌పి. లేఅవుట్ లోని ఫామ్ గార్డెన్ థీమ్ పార్కును పరిశీలించి ఆహ్లాదాన్ని కలిగించే మొక్కలతో పార్కును ఈనెల 15లోగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించిన కమిషనర్‌ను నివాస సంక్షేమ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ పర్యటనలో ఎస్ఇ శాంసన్‌రాజు, ఇఇ శాంతిరాజ్, హార్టికల్చర్ డిడి ఎం.దామోదరావు, ఎసి. శాస్త్రి, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎస్.కిశోర్, డిఇఇ. వంశీకృష్ణ, ఎఇ సురేష్, హార్టికల్చరిస్ట్ గాసిబాబు పాల్గొన్నారు.

భూసర్వేను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని గొట్టిపల్లిలో సమగ్ర భూసర్వేను తహశీల్దార్ లోకవరపు రామారావు, సర్వేయర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ గంటా జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజల సమక్షంలోనే సర్వే నిర్వహించి, హద్దురాళ్ల ఏర్పాటు, కచ్చితమైన శాశ్వత హక్కు పత్రాలు, రెవెన్యూ రికార్డులు యజమానులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట్ జగన్, పంచాయతీ సర్వేయర్ నరేష్ కుమార్, విఆర్ఒ సుమిత్ర పాల్గొన్నారు

బయో ఇన్ఫర్మేటిక్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి -మధురవాడ: నగరంలోని ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్ ప్రయోజనాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ జెసి.బోస్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌ను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎన్. కృష్ణ ప్రారంభించారు. పెటివా లిమిటెడ్ సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ సౌమెన్‌దే విద్యార్థులకు ఔషధ తయారీ రంగంలో స్ట్రక్చరల్ బయాలజీ, డ్రగ్ డిజైనింగ్ వంటి అంశాలను వివరించారు. . గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి గీతంలో నిర్వహిస్తున్న సైన్స్ కోర్సులను వివరించారు. బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.విజయా రేచల్ విద్యార్థులకు మాలిక్యులర్ బయాలజీ, మాలిక్యులర్ మోడలింగ్ అంశాలతోపాటు సైన్స్ పరిశోధనలలో మాస్ స్పెక్ట్రోస్కోపీ ఉపయోగాన్ని వివరించారు.. కార్యక్రమంలో నిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.వాసుదేవరాజు, ప్రొఫెసర్ మళ్ల రామారావు, ప్రొఫెసర్ చల్లా సురేఖ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆర్‌ఎంపిల సేవలు ఎంతో అవసరం



గ్రామీణ వైద్యుల ప్రజావేదికలో మాట్లాడుతున్న జోషి

ప్రజాశక్తి -ఆనందపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపిల సేవలు ఎంతో కీలకమనిఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. శుక్రవారం మండలంలోని బుడగ జంగాల కాలనీలో ఆర్‌ఎంపిల ఆవశ్యకతపై ప్రజావేదికను నిర్వహించారు ఐఎంఎ డాక్టర్ ఎస్ఎల్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జోషి మాట్లాడుతూ, 60ఏళ్లకుపైగా గ్రామాలోల ఆర్‌ఎంపిలు వైద్యసేవలు అందిస్తున్నారని, వీరి సేవలను గుర్తిస్తూ ఇటీవల జిఒ 429ను ప్రభుత్వం జారీ చేసినా, దాని అమలులో పారదర్శకత లోపించిందన్నారు. నేడు ఆర్‌ఎంపిలను పట్టించుకునే నాథులే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ మాట్లాడుతూ,ఆర్‌ఎంపిలకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యానికి అర్హత కల్పించాలనారు. కార్యక్రమంలో కొట్యాడ రెడ్డి బాబు, షినగం చిన్న రామారావు, కొట్యాడ సత్యమూర్తి బుడగ జంగాల నాయకుడు గౌరీ, ఆర్‌ఎంపి గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, జోనల్ కార్యదర్శి ఎన్. సుగుణేశ్వరి, స్థానిక అధ్యక్ష కార్యదర్శులు. పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, కె. నారాయణ రావు,వినోద్, రఘు, పచ్చిపులుసు కనకరావు ,వాసు పాల్గొన్నారు.

స్కేటింగ్ రింగ్‌లా బిఆర్‌టిఎస్ రోడ్డు



బిఆర్‌టిఎస్ రోడ్డుపై స్కేటింగ్ సాధన చేస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి- వేపగుంట : క్రీడాసక్తి ఉన్నా సరైన మైదానం లేక అవస్థలు పడే స్కేటర్స్‌కు బిఆర్‌టిఎస్ రోడ్డుస్కేటింగ్ రింగ్‌లా మారింది. వేకువజామున ట్రాఫిక్ లేకపోవడం, మధ్య మార్గంలోని వాహనాలకు అనుమతి లేకుండా కొన్ని ప్రాంతాల్లో పోలీసులు స్టాపర్స్ పెట్టడంతో, ఖాళీగా ఉన్న బిఆర్‌టిఎస్ రోడ్డును కొందరు స్కేటర్లు స్కేటింగ్ పార్కుగా వినియోగించుకుంటూ సాధన చేస్తున్నారు. గోపాలపట్నం పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి పెందుర్తి వైపు వెంకటాపురం జంక్షన్ ప్రాంతంలో నలుగురైదుగురు క్రీడాకారులు స్కేటింగ్ చేస్తూ కనిపించారు. బిఆర్‌టిఎస్ రోడ్డు ప్రమాదభరితమని తెలిసినా పిల్లలు వినకపోవడంతో తల్లిదండ్రులే దగ్గరుండి స్కేటింగ్ చేయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో బిఆర్‌టిఎస్ రోడ్డులో విద్యుత్ సౌకర్యం నిలిపేస్తుండడంతో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి స్కేటింగ్ క్రీడాకారులు సాధనకు స్కేటింగ్ రింగ్ ఏర్పాటు చేయాలని పలువురుకోరుతున్నారు.

విమ్స్‌ను క్యాంపు కార్యాలయం చేయొద్దు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర అభివృద్ధి, సమీక్ష పేరుతో విమ్స్ ఆసుపత్రిలో అధికారుల క్యాంపు కార్యాలయాలు, విడిది ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. శుక్రవారం విమ్స్ ప్రధాన ద్వారం వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విమ్స్‌ను ప్రజోపయోగకరంగా అభివృద్ధి చేయాలన్న విజ్ఞప్తిని కాలరాసి, ఇప్పుడు అనాలోచిత నిర్ణయంతో విమ్స్‌ను నిర్వీర్యం చేయాలని చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె అచ్యుతరావు, ఎస్‌కె రెహ్మాన్, కె.సత్యాంజనేయ, ఎం.మన్మథరావు, ఆర్. శ్రీనివాస రావు, క్షేత్రపాల్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎండి బేగం, ఎ.దేముడమ్మ, పుష్పలత, నాగభూషణం. ఈశ్వరరావు, కెల్లన్నరావు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిపిఐ నాయకులు

నేరాలు ఘోరాలు

88 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో నిండుగొండ జంక్షన్ వద్ద పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో ఆటోలో తరలిస్తున్న 88కిలోల గంజాయి పట్టుబడిందని స్థానిక ఎస్ఐ సురేష్ తెలిపారు. పక్కాగా అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహించగా, అనుమానాస్పదంగా వచ్చిన ఆటోను తనిఖీ చేయగా, మూడు మూటల్లో 88 కేజీల గంజాయి లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. ఆటోకు పైలెట్‌గా వస్తున్న ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌ను విడిచిపెట్టి తప్పించుకొని పరారయ్యారు. గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నబాలుడిని జువెనైల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపాఉ. ఆటో, స్కూటర్‌తోపాటు గంజాయిని సీజ్ చేశారు.

చోరీలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పెందుర్తి : చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ ఎస్ఐ సల్మాన్ అన్నారు శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, అపార్టుమెంట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలు బయటకు వెళ్లేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలను చున్నీ, పైటకొంగులతో భద్రపరుచుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి క్యాంపులు వెళ్లాల్సి వస్తే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.విలువైన ఆభరణాలను లాకర్లలో భద్రపరచుకోవం, అపరిచిత వ్యక్తుల పట అప్రమత్తత వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించకుంటే

20 నుంచి నిరవధిక సమ్మె



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి-పద్మనాభం : కనీస వేతనం, రెగ్యులరైజేషన్, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ఎంఇఒ బాబూలాల్‌కు వినతిపత్రం అందజేశారు. సిఎం ఇచ్చిన హామీ అమలుతోపాటు, 15 ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 20నుంచి నిరవధిక సమ్మె, వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామన్నారు.

ఆటోస్టాండ్, పార్కింగ్ స్థలాలివ్వాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలో ఆటో స్టాండ్, పార్కింగ్ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా , ఎఐటియుసి అనుబంధ, ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి జిల్లా కార్యదర్శి పడాల గోవిందుడు మాట్లాడుతూ నగరంలో ఆటో స్టాండ్, పార్కింగ్ స్థలాల ఏర్పాటుతోపాటు , ఆటో అండ్ మోటార్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ బోర్డు చేయాలని, ఆటో, మోటార్ వాహనాలపై ఉన్న పోలీస్, ఆర్‌టిఒ ఇ-చలానాలు రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. జిఒలు 21, 31లను రద్దుచేయాలన్నారు. ధర్నాలో స్టాండ్ అధ్యక్షులు వై వెంకటరమణమూర్తి, హెచ్ శేఖర్, కె.చంటి జై గణేష్ కుమార్, లండ అప్పారావు, చిన్న రెడ్డి, పి కనకరాజు, కృష్ణ నాయుడు, కె.నూకరాజు పాల్గొన్నారు

3న షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 3న 19 ఏళ్ల లోపు బాలబాలికలకు షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి కుమార్, ఎం అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9,10,11 తేదీల్లో బాపట్లలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు

హామీలు అమలు చేయకుంటే ఆందోళన

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఆందోళన తప్పదని స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సి పాండే ఆహ్వానం మేరకు టిఎన్‌డిసి సమావేశ మందిరంలో డిపి, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు.



డైరెక్టర్ పర్సనల్‌కు సమస్యలు నివేదిస్తున్న రామస్వామి

ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపడం చేతకాక, కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయలేని యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులను పరిపాలన భవనంలోకి రానివ్వకుండా కంచెలు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనానరు. సకాలంలో జీతాలు అందక కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, దీన్ని సరిదిద్దకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి పేరుతో జిందాల్‌ను ప్లాంట్‌లోకి ఆహ్వానిస్తే సహించబోమని,జిందాల్ స్థానంలో సెయిల్‌ను అనుమతించాలని డిమాండ్ చేశారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యసేవలు మెరుగుపరచడం, సకాలంలో క్లస్టర్ ప్రమోషన్ల టెస్టులు నిర్వహణ, పిఎఫ్ జాయినింగ్ తేదీలలో తప్పులు సరిచేయడం, వికలాంగులకు సెయిల్ మాదిరిగా రెండు టిఎల చెల్లింపు, గంట్యాడ రోడ్డులో ట్రాఫిక్, భద్రతా నిబంధనలు అమలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామకాల నిలుపుదల వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై డిపి ఎస్‌సి పాండే స్పందిస్తూ నిర్దిష్ట సమయంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో బి అప్పారావు, పి శ్రీనివాసరాజు, డివి రమణారెడ్డి, డి సురేష్ బాబు, సిహెచ్ సన్యాసిరావు, యు వెంకటేశ్వర్లు, మరిడయ్య, కృష్ణమూర్తి, గంగాధర్, పుల్లారావు, కె వి సత్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు రోడ్డును డబుల్ చేయండి



సుబ్బారెడ్డికి సమస్య విన్నవిస్తున్న డిప్యూటీ మేయర్, కమిషనర్

ప్రజాశక్తి- వేపగుంట : ఎయిర్‌పోర్ట్ అథారిటీ స్థలంలో ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రోడ్డును అన్ని వసతులతో కూడిన 60 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు.జాతీయ రహదారిలో పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి అరకు బౌదరా రోడ్డును అనుసంధానం చేస్తూ నేతాజీకాలనీ మీదుగా శాంతినగర్ చర్చి వరకు ప్రస్తుతమున్న 30 అడుగుల రోడ్డును విస్తరించి, 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును అభివృద్ధి చేయాలని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. శుక్రవారం 52వ వార్డులో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి వార్డు పర్యటనకు వచ్చిన వైవి.సుబ్బారెడ్డిని శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ స్థలంలో ఉన్న 30అడుగుల రోడ్డును డబుల్ చేస్తే విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల ట్రాఫిక్ కష్టాలు తీరిపోతాయన్నారు. దీనిపై ఇప్పటికే సీఎం జగన్‌కు విన్నవించామన్నారు. దీనిపై వైవి.సుబ్బారెడ్డి స్పందిస్తూ, రోడ్డు విస్తరణ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీమాజీ ఛైర్మన్ ఆల్లా కృష్ణ, జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీను పాల్గొన్నారు.

శుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



పరిశుభ్రతపై సూచనలు చేస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి -మధురవాడ : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులేవీ దరి చేరవని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శుక్రవారం వార్డుపరిధిలోని శివశక్తి నగర్ కాలనీలో జీవీఎంసీ మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు ఆధ్వర్యంలో ఫ్రైడే‌డ్రైడే నిర్వహించారు. ఇళ్ల పరిసరాల్లో దోమలు, లార్వాలు వృద్ధికి కారణమైన నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. వార్డు పర్యటనలో భాగంగా పారిశుధ్య సమస్యను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి శుభ్రం చేయించారు.కార్యక్రమంలో టిడిపి నేతలు మొల్లి లక్ష్మణరావు, సరస్వతి, నారాయణరావు, సచివాలయ సిబ్బంది లోకేష్ పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- పెందుర్తి : 92వ వార్డు బంటా కాలనీలో రూ.44లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కంపర సత్తిబాబు జగదీష్, శంకర్, షేక్ వలీ పాల్గొన్నారు



శంకుస్థాపన చేస్తున్న బెహారా భాస్కరరావు

మహిళా చట్టాల అమలులో విఫలం : ఐద్వా



నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : మహిళా చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ విమర్శించారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా చట్టాలకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని మండిపడ్డారు. రిజర్వేషన్ల పేరిట మహిళలను మోసపుచ్చుతోందన్నారు. ఐద్వా నేత బి. రమణి మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, మహిళలపై దాడులను ప్రోత్సాహించేలా బిజెపి విధానాలున్నాయని మండి పడ్డారు. కార్యక్రమంలో ఐద్వా జోన్ కార్యదర్శి లక్ష్మి, డి.లావణ్య పాల్గొన్నారు

కోసిన వెంటనే వరి చేను భద్రపరుచుకోవాలి

ప్రజాశక్తి భీమునిపట్నం : రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడే సూచనలున్నందున వరిపంట కోత పూర్తయిన వెంటనే చేనును సురక్షిత ప్రాంతంలో భద్ర పర్చుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ రైతులకు సూచించారు శుక్రవారం మండలంలోని సింగనబంద, నారాయణరాజుపేట గ్రామాల్లోఏఒ అధికారి బి శివకోమలి, ఆర్‌బి కె సిబ్బంది హరీష్, రమేష్‌లతో కలిసి పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. ఎంటియు 1121రకం వరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు.



వరి పంట కుప్పను పరిశీలిస్తున్న ఎడిఎ విజయప్రసాద్

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి -గాజువాక: వైసిపి సమన్వయకర్త, ఎపిఎస్‌ఎంఐడిసి ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆండాలమ్మ కాలేజీలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డితో కలిసి ఆనందకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి జాబ్‌మేళా ప్రారంభించారు. 85 కంపెనీలు పాల్గొని సుమారు ఏడు వేలమంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, వారిలో 1256మందికి ఉద్యోగావకాశాలను కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో నిరుద్యోగులందరికీ ఉద్యోగాలిచ్చే లక్ష్యంతో సిఎం జగన్ ఆదేశాల మేరకు ఆనందకుమార్ ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశారని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఉద్యోగ ఆఫర్లు పొందిన వారికి నియామకపత్రాలను అందజేశారు.



నియామక పత్రాలను అందజేస్తున్న సుబ్బారెడ్డి, ఆనందకుమార్

ఆనందకుమార్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు అనుగుణంగా మిలీనియం శ్రీధర్‌రెడ్డితో చర్చించి ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. నెలరోజుల్లో గోపాలపట్నంలో మరో మెగాజాబ్‌మేళా నిర్వహించనున్నారని, ఉద్యోగాలు రాని వారు నిరాశ చెందవద్దన్నారు. స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్ ఎపి ప్రభుత్వ సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, శనివారంకూడా జాబ్‌మేళా కొనసాగుతుందని, మరిన్ని వివరాలకు 90008 18467, 90009 38467 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎస్.ఎ.రెహమాన్ పాల్గొన్నారు.

గ్రావెల్ దందాపై చర్యలేవీ ?

ప్రజాశక్తి -భీమునిపట్నం :కొండలను తొలిచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యల్లో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రశ్నించారు శుక్రవారం భీమిలిలో విలేకరులతో మాట్లాడుతూ, అభివృద్ధి పేరిట కొండలను తవ్వేసి పర్యావరణానికి ముప్పు కలిగించే చర్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగో వార్డు కొత్తవలసలో సర్వే నంబర్ 73లో ఓ స్వామి కి ఆశ్రమానికి ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాల స్థలంలో ఆశ్రమం నిర్మాణానికి తవ్విన గోతుల్లోని గ్రావెల్ ఎటు పోయిందనిని ప్రశ్నించారు. అలాగే గొల్లలపాలెం కస్తూర్బాను ఆనుకుని సర్వే నంబర్ 87లో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కేటాయించిన రెండెకరాల స్థలంలోని గ్రావెల్‌ను ఏం చేశారని ప్రశ్నించారు. గ్రావెల్ తరలింపు, కొండల ఆక్రమణపై రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ పెంచాలని కోరారు

ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి -ఆనందపురం: స్థానిక పిహెచ్‌సిని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఈ ఏడాది నమోదైన మలేరియా, డెంగీ కేసు ల వివరాలను వైద్యాధికారి డాక్టర్ గంగునాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిహెచ్‌సిలోని ల్యాబ్‌ను పరిశీలించారు.డెంగీ, మలేరియా కారకమైన దోమలు, వాటి లార్వాల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేశారు. అనంతరం ఎల్‌వి.పాలెం సందర్శించి, ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యసేవలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఫ్రైడే డ్రైడే అమలును తనిఖీ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి సాంబమూర్తి, లాబ్ టెక్నీషియన్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

3న ఉచిత హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న భీమిలి చిన్న బజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం : వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని పాలవలస, పందలపాక పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు.గ్రామ సచివాలయం కార్యదర్శి ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ, .ప్రసాదరావుపట్నాయక్, ఉప్పాడ అప్పారావు కోరాడ శంకరరావు, కె.రాముునాయుడు, మీసాల రాము నాయుడు, బండారు అనిల్ కుమార్, యోలూరు ధర్మవతి, దుక్క వెంకట రావు, పి.చిన్నారావు, అనిల్‌రాజు, జి.రమణ రమేష్ పాల్గొన్నారు.

పద్మావతికి గీతం పిహెచ్‌డి అవార్డు

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగంలో జరిపిన పరిశోధనకు బి. పద్మావతికి గీతం పిహెచ్ అవార్డ్ లభించింది. రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎన్‌విఎస్.వేణుగోపాల్ పర్యవేక్షణలో నానో క్రిమి సంహారకాలపై పరిశోధనలు జరిపి, సమర్పించిన థీసెస్‌కు పద్మావతికి డాక్టరేట్ ప్రకటించారు. వ్యవసాయ రంగానికి ఈ పరిశోధనా ఫలితాలు ఎంతో దోహదపడగలవని పద్మావతి వెల్లడించారు.



పద్మావతి

అన్నసమారాధన

ప్రజాశక్తి- వేపగుంట : అన్ని దానాల కంటే అన్నదానం మహత్తరమైనదని స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. శుక్రవారం 94వ వార్డు కృష్ణానగర్‌లోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనను ప్రారంభించి, స్వయంగా వడ్డించారు. గుడి నిర్మాణానికి కృషి చేసిన ఎర్రా నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ప్రజాశక్తి-చోడవరం : బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తుఫాన్‌గా మారే సూచనలు కనిపిస్తున్నట్లు ప్రసారమాధ్యమాల్లో అధికారులు ప్రకటించిన నేపథ్యంలో అన్నదాతల్లో గుబులు మొదలైంది. కోత దశలో ఉన్న వరి పంట చేతికొచ్చే సమయంలో తుఫాను వల్ల వర్షాలు కురిస్తే అపార నష్టం సంభవిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వరి పంటకు గడ్డు పరిస్థితి అని చెప్పవచ్చు. పంట ప్రాథమిక దశలో అనావృష్టి సంభవించడంతో రిజర్వాయర్లు, చెరువుల కింద, బోర్ల నీటి వసతి కలిగిన వద్ద రైతులు సాగు చేపట్టారు. చాలా మెట్ట ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితి వల్ల పంటలు ఎండిపోయాయి. తీరా ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ గండం భయభ్రాంతులకు గురిచేస్తుంది. చోడవరం మండలంలో సుమారు 4500 హెక్టార్లలో వరి పంట సాగు అవుతుంది.



కోత దశలో ఉన్న వరి పంట

దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ పంట పక్వానికి వచ్చి ఉంది. ఈనెల మూడో తేదీ నుండి ఆరో తేదీ వరకు విపరీతమైన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు గాలులు తోడైతే పంట మొత్తం నేలమట్టమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జన శిక్షణా సంస్థాన్ సహకారంతో శ్రీగౌరీ గ్రంథాలయంలో ఈ నెల 2 నుంచి టైలరింగ్ (డ్రెస్ మేకర్), బ్యూటీషియన్ (బ్యూటీ కేర్), కంప్యూటర్ ఆపరేటర్ ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలను ప్రోత్సహించేందుకు స్వయం ఉపాధి రంగంలో మూడు నెలల పాటు జరగనున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బయోమెట్రిక్ హాజరుతో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో టైలరింగ్, బ్యూటీషియన్ (బ్యూటీ కేర్), కంప్యూటర్ తరగతుల ఒక బ్యాచ్‌కు 20 మందికి మాత్రమే శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా కాలంలో కావల్సిన స్టేషనరీ, మెటీరియల్‌ను అందిస్తామన్నారు. శిక్షణకు హాజరు కాదలచిన అభ్యర్థులు ఆధార్ కార్డు నకలు, ఫోటో, దరఖాస్తును తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9247166511 నెంబర్‌ను సంప్రదించాలని కాండ్రేగుల వెంకటరమణ ఆ ప్రకటనలో తెలిపారు.

వడ్డాదిలో ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి- వడ్డాది

బుచ్చెయ్యపేట మండలం, వడ్డాది పంచాయతీ కార్యాలయం వద్ద కస్పా కాలువలో శుక్రవారం ఉదయం ట్రాక్టర్ బోల్తా పడింది. స్థానిక ఎస్సీ కాలనీ నుండి ఓ డ్రైవర్ ట్రాక్టర్‌ను ఇరుకుగా ఉన్న కాలువ గట్టుపై నుండి తీసుకువచ్చాడు. ఇక్కడ అదుపు తప్పి కాలువలో బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటుమరో వ్యక్తి ట్రాక్టర్ పై నుండి దూకేయడంతో ప్రమాదం నుండి బయటపడ్డారు. కస్పా కాలువపై ద్విచక్ర వాహనాల రాకపోకల కోసం నిర్మించిన మినీ వంతెనపై ట్రాక్టర్లు, టాటా ఏసీ స్కూల్ బస్సులు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పెద్ద వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా స్కూల్ వ్యాన్లు కూడా ఈ గట్టుపై నుండే వెళుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని పిఎస్ పేట గ్రామంలో శ్రీదుర్గాదేవి ఆలయ 32వ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్), ఆయన తనయుడు సంజయ్ వేడుకలకు హాజరు కాగా, వారికి గ్రామ పెద్దలు, మహిళలు పూల వర్షాలతో, మందు గుండు సామాగ్రి స్వాగతం పలికారు. ముత్యాల వెంకటేశ్వరరావు దుర్గాదేవి ఘటాలు తల పైన పెట్టుకుని రెండు కిలోమీటర్ల మేర అమ్మవారి గుడి వద్దకు వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎంవిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన, సంజయ్ యువసేన సభ్యులు, పిఎస్ పేట గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ఎంవిఆర్, సంజూబాబులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

బైజూస్ ట్యాబ్‌లు వినియోగించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

తొమ్మిదో తరగతి విద్యార్థులు బైజూస్ ట్యాబ్‌లను తప్పనిసరిగా వినియోగించుకుని అందులో ఉన్న పాఠ్యాంశాలను అవగాహన చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు (ఆర్.జె.డి.) ఎం.జ్యోతికుమారి విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఏ కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలు, నోటు పుస్తకాలు పరిశీలించారు. రక్తహీనత గల విద్యార్థులకు ఐఎఫ్ఎ టాబ్లెట్స్ పంపిణీ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉన్న ఇద్దరు ఎంఈఓలు ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థాయిని పెంచుటకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌జెడిని సత్కరిస్తున్న డాక్టర్ ఖాశీం తదితరులు

ఆర్‌జెడిని సత్కరించిన ఖాశీం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీ నిమిత్తం శుక్రవారం వచ్చిన ఆర్‌జెడి ఎం.జ్యోతికుమారిని ఎంఇఒ కార్యాలయంలో స్థానిక అయ్యన్న విద్యా సంస్థల అధినేత, జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డ్ సభ్యుడు, 'అపుస్మా' రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగం చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టరు ఖాశీం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ కరెస్పాండెంట్స్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- దేవరాపల్లి : సామాజిక న్యాయం, దళితహక్కుల రక్షణ కోసం ఈనెల 4న చేట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న శు క్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో నేటికీ దళిత, గిరిజనులపై దాడులు, అత్యాచారాలు, హింస సాగుతున్నాయని, మణిపూర్ మనువాదులు ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి హత్యాచారం చేయడం యావత్ భారతాన్నే తలదించుకునేలా చేసిందని పేర్కొన్నారు. ఇంత జరిగినా ప్రధాన మంత్రి మోడీ పల్లెత్తు మాట మాట్లాడక పోగా దోషులకు రక్షణ కల్పించడం అత్యంత సిగ్గు చేటన్నారు. ఇటువంటి ఘటనలను ఎపిలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఖండించకపోవడం దారుణమన్నారు. అణగారిన వర్గాలను పాలక పార్టీలకు ఓటు బ్యాంక్ తప్ప మనుషులుగా చూడడం లేదన్నారు. బిజెపి పాలనలో దళిత, గిరిజన హక్కులకు కాలరాయపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో దళిత, గిరిజనులు, అణగారిన వర్గాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వెంకన్న కోరారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు శుక్రవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన గొంప కాంతమ్మ తాటాకుల ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన విషయం విధితమే. విషయం తెలుసుకున్న రామానాయుడు బాధితురాలిని శుక్రవారం పరామర్శించి పదివేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి ఎరుక నాయుడు, శరగడం భూలోక నాయుడు, శ్రీను, మద్దాల శివ, మొల్లి గోవింద, బండారు దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధునికి పెన్షన్ అందజేత

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన వెళ్తున్న వద్దుడు సత్యనారాయణకు శుక్రవారం వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు, స్థానిక వాలంటీర్‌తో కలిసి తుని వెళ్లి వృద్ధాప్య పెన్షన్ అందజేశారు. వాడ్రాపల్లి గ్రామానికి చెందిన పలువురు భక్తులు వెంకటేశ్వర స్వామి మాల ధరించి గురువారం గ్రామం నుండి తిరుపతికి కాలినడకన బయలుదేరారు. అందులో పాల్గొన్న సత్యనారాయణకు నూకరాజు ఆధ్వర్యాన తునిలో పింఛను అందజేశారు.

గౌరీ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 84వ వార్డు పిల్లా వారి వీధిలో వెలసిన శ్రీగౌరీ పరమేశ్వరి అమ్మవారిని శు క్రవారం తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు దర్శించుకున్నారు. అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం తారకేశ్వరరావు నాగ జగదీష్‌కు శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కుప్పిలి జగన్, కాండ్రేగుల సత్యనారాయణ, యలమంచిలి బంగారు రాజు, మాధురి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి గంటా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు మండలంలోని నర్సింగబిల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు, వేగి గోపికృష్ణ నైనంశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, కలగా సోమేశ్వరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఇఒకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-చోడవరం : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు స్థానిక ఎంఈఓకు శు క్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తమ యూనియన్ పిలుపుమేరకు ఈ నెల నాలుగో తేదీ సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆవేదన దీక్షను చేపడతామన్నారు. రెగ్యులర్ చేయాలని, ఎంటిఎస్, డిఎ, హెచ్‌ఆర్ఏ అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల కోరుతూ చేయనున్న ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సామూహిక సెలవులు పెట్టి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనకు రావాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించినప్పుడే ఆరోగ్య సమాజం నెలకొంటుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటాడ ఆరోగ్య ఉప కేంద్రం వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

5న సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చోడవరం : ఈనెల ఐదో తేదీన వడ్డాదిలో చేపట్టే బీసీ సాధికారి బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులతోనూ, పంచాయతీ కార్యాలయం వద్ద వాలంటీర్లతోనూ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుండి బస్సు యాత్రకు సుమారు 50000 మంది రానున్నారని తెలిపారు. బస్సు యాత్ర ముందుగా సుమారు 4000 బైకులతో ర్యాలీ ఉంటుందని చెప్పారు. ప్రతి గ్రామం నుండి 500 మందికి తగ్గకుండా ప్రజలను సమీకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి సన్మానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : కె.కోటపాడు మండలం చౌడువాడ పంచాయతీ గవరపేట సంతోషిమాత ఆలయం నుండి జుత్తాడ రోడ్డు వరకు సిసి రహదారి మంజూరు చేసినందుకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును చౌడువాడ గ్రామ రైతులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. దేవరాపల్లి మండల తారువ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాపేటి రామానాయుడు ఆధ్వర్యాన రైతులు డిప్యూటీ సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎట్టకేలకు తమకు కావలసిన మౌళిక వసతులు కల్పనకు కృషి చేసిన మంత్రికి తాము ఎంతో రుణ పడి ఉన్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీ రాజు, ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపిటిసి అప్పాలరాజు, ఆకుల సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కశింకోట : గుంటూరులో జరిగిన 33వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాల 7వ తరగతి విద్యార్థి యసస్వీని ప్రతిభ కనబర్చి రెండు స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం యసస్వీని పాఠశాల డైరెక్టర్ నోబుల్ కుమార్, కరస్పాండెంట్ అనురాధ, ప్రిన్సిపల్ సాజిద్ సిహెచ్ అల్ విద్యార్థులు అభినందించారు.



పతకం చూపుతున్న యశస్వి, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు



విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

విద్యార్థులకు డిఇఒ అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి : రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్ కాంగ్రెస్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపికైన నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను డిఇఒ వెంకట లక్ష్మమ్మ అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయురాలు జి.సుమబిందు పర్యవేక్షణలో విద్యార్థులు జయవర్ధన్, జయదుర్గ, నానాజీలు అరటిదువ్వ పొడిని ఉపయోగించి భూ సారాన్ని పెంచడం పై ప్రాజెక్టును రూపొందించి జాతి స్థాయికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ఎంపికైన విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయురాలు అనకాపల్లిలో డీఈఓ కార్యాలయంలో డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మెరకు డీఈఓ వెంకటలక్ష్మమ్మ ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలోనూ సత్తా చూపాలని ఆకాంక్షించారు.

నేడు వినియోగదారుల చట్టంపై సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండల కన్స్యూమర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని గౌరీ గ్రంథాలయంలో 'మహిళలు-వినియోగదారుల హక్కులు రక్షణ చట్టం' అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కౌన్సిల్ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వస్తువులు కొనుగోలుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హాల్‌మార్క్ బంగారు ఆభరణాల స్వచ్ఛత, తూనికల్లో తేడాలు, కొలతల్లో మోసాలు, ఆన్‌లైన్ కన్స్యూమర్స్, వినియోగదారుల రక్షణ చట్టం లక్ష్యాలు, ప్రయోజనాలు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సదస్సుకు స్వచ్ఛంద, మహిళా సంఘాల ప్రతినిధులు, హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9247166511ను సంప్రదించాలన్నారు.

3న ఉపకార వేతన అర్హత పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయస్థాయిలో విద్యార్థుల ఉపకార వేతన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఈనెల 3న నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. స్థానిక డిఇఒ కార్యాలయంలో శుక్రవారం సీఎస్, డివోల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్లో 10 కేంద్రాలు, నర్సీపట్నం డివిజన్లో 8 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 4,157 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. ఉపవిద్యాశాఖ అధికారి అప్పారావు, అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు సమావేశంలో పాల్గొన్నారు.

అట్రాసిటీ పర్యవేక్షణకు ప్రత్యేక వెబ్ పోర్టల్

ప్రజాశక్తి-అనకాపల్లి : పిఒఎ చట్టం, నిబంధనల అమలును ఆన్లైన్ పర్యవేక్షించేందుకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి టి అజయ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు రెవెన్యూ సంక్షేమ శాఖలకు సంబంధించిన విచారణ, చార్జిషీటు, పరిహారం, ఉత్తర్వుల లింకు ద్వారా స్టేటస్ తెలుసుకునే అవకాశం ఈ పోర్టల్ అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు పోర్టల్ వెబ్సైట్ https://poa.apcfss.in సర్వీస్‌లో ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ వినియోగించి గ్రీవెన్స్ స్టేటస్‌ను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి రామాలయం వద్ద గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపు రెడ్డి సింహాచలం నాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కెవి రమణ, వైసిపి నాయకులు గొర్లెపోటు రమాదేవి, లలితా నాయుడు, గుండు రాంబాబు, గండిపడాల అప్పలరాజు, దీవి శంకర్రావు, మిడతాడ శ్రీను, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ మాలిబాబు, గాలి సూర్యలక్ష్మి, పరవాడ రవి, కొల్లి బాలకృష్ణ, వాలేటి నాగరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా గౌరీ పరమేశ్వరుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ లక్కీ డ్రాలో విజేతగా నిలిచిన వారికి కిలపర్తి భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన, అప్రమత్తత అవసరం

- జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి
- పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ఎన్టీఆర్ ఆసుపత్రి ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ తగ్గు ముఖం పడుతూ చాలా తక్కువ స్థాయిలో ఉందన్నారు. అయినప్పటికీ ప్రమాదకరమైన ఈ వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందుగా ఎయిడ్స్‌పై పోరాటానికి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్, డిఎస్పి సుబ్బరాజు, అడిషనల్ ఎడిఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ సి.కిషోర్ కుమార్, డిఎల్ఓ వీకే బాలాజీ, ఏటీఆర్ ఎంఒ డాక్టర్ ప్రియదర్శిని, ఆర్ఎంఒ లక్ష్మీ శ్రీనివాస్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాశాలల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కెవిఎన్.మహేశ్వరరావు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. సత్యనారాయణపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కన్వీనర్ జె.సామ్రాజ్యం, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట పిహెచ్‌సి వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణరావు, వైద్య సిబ్బంది రామ్మూర్తి, సత్యవతి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ పిహెచ్‌సి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు జయశ్రీ కరిష్మా, హారిక, యేసు ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డి.శ్రీలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులు ఎయిడ్స్ అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, సునీల్, రెడ్డి రమ, జీవి వైదేహి, నందకిషోర్, కె.ప్రశాంత్, సురేంద్రనాథ్, ఐసిటిసి కౌన్సిలర్ కె.దేముడు బాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి, వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.స్వర్ణలత, ఉపాధ్యాయుడు రొంగలి శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి సునీత మాట్లాడుతూ, ఎయిడ్స్ నిర్మూలనకు అవగాహన ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీను, ఎంపిహెచ్ఇఒలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం మాడుగుల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, జంతు శాస్త్ర విభాగం, ఐసిటిసి ఆధ్వర్యాన మాడుగుల బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టం. చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ఎస్ శాస్త్రి, ఐసిటిసి కౌన్సిలర్ వి.శ్రీనివాసరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన ఎయిడ్స్ అవగాహన ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ సూర్య ప్రసాద్ ప్రారంభించారు. సిబిఎం హైస్కూల్, గంటస్తంభం మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, పిఒలు పి.వేణుగోపాల్, కె ప్రసాదరావు పాల్గొన్నారు. సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో పాత బస్టాండ్ వరకు ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రి , దంత వైద్య కళాశాల, ప్రజా దంత వైద్య విభాగం ఆధ్వర్యాన భీమిలి పుర వీధుల్లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శివకుమార్, డాక్టర్ అవినాష్ పాల్గొన్నారు



రోలుగంట మండలం బుచ్చెంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పద్మనాభం : ప్రపంచ ఎయిడ్స దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో మద్ది జెడ్పి ఉన్నతపాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎఎన్ఎం పుష్పలత, ఎంఎల్‌హెచ్‌పి అనురాధ, .లింక్ హెల్త్‌వర్కర్ ఎం.జ్యోతి, ఆశాలు బంగారమ్మ., వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి బిపి, షుగర్ లాంటిదే : డాక్టర్ కూటికుప్పల

మాధవధార : ఎయిడ్స్ వ్యాధి కూడా సుగర్, బీపి లాంటిదేనని, రోజుకు ఒక టాబ్లెట్‌తో 75 ఏళ్ళ జీవించవచ్చని ప్రముఖ వైద్యులు పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యరావు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కంచరపాలెం మెయిన్ రోడ్డులోని కెఐఎస్ఆర్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒకప్పుడు ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధికి ఇపుడు ఎఆర్‌టి వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇవేకాక లాంగ్ యాక్టింగ్ ఇన్జెంట్స్ (చిప్స్), మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా 200 మంది ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో డాక్టర్లు సుభాదేవి, అచ్యుతరావు, కవిత, మధుకర్ పాల్గొన్నారు.

ఎపిలో అధికంగా సంక్షేమ పథకాల అమలు

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్లో అత్యధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎపి ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని కుంచంగిలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి దిలీప్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పెద్దశెట్టి గోవింద ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును, వైసిపి జెండాను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రొంగలి జగన్నాథరావు, ఎంపీటీసీ అచ్చెమ్మ, గొర్లి అప్పలనాయుడు, నరసింహానాయుడు, లక్ష్మణరావు, బాజ్జి, నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

నెయ్యిలవీధిలో..

అనకాపల్లి పట్టనంలోని నెయ్యిల వీధిలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, జెసిఎస్ కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు జాజుల మురళీకృష్ణ ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జివిఎంసి జోనల్ కమిషనర్ పి వెంకటరమణ, ఎపిడిఒ దొర, మాదురి నాయుడు, గాడి సుజాత, ఏడువాకల నారాయణ రావు, పలకా సత్యనారాయణ, విల్లూరి శివ సూరి, ఉమ్మిన పైడిరాజు, వాసు, దిమిలి సత్తిబాబు, నాగులపల్లి వీర్రాజు, వెంకటేష్, శేషు, కోన ఉమా, దొంక సత్తిబాబు, పేలురు కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆరిలోవ : 13వ వార్డులో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొని సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్ళి వైసిపి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు వెంకట రెడ్డి, కాకర గోవిందు, బేబి, బాబూరావు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం గ్రామంలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో బంక సత్యం, మజ్జి వెంకటరావు, పాండ్రంకి శ్రీను, ఎంపిటిసి పల్ల దుర్గ, లంక రాంబాబు కోరాడ వెంకటరమణారావు, రౌతు శ్రీను, రౌతు చిన్న శ్రీను, రౌతు వెంకట్రావు పాల్గొన్నారు

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని నరసింగబిల్లి గ్రామంలో బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్యనారాయణ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, మజ్జి నిరంజన్ కుమార్, కడిమిశెట్టి నరసింగరావు, ఎంపిటిసీలు షేక్ దర్గా, బుద్ధిరెడ్డి అప్పడు, కర్రి దుర్గి నాయుడు, సిద్దిరెడ్డి సూర్యనారాయణ, శివ, ప్రసాద్, కోనా రమణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే విద్యుత్, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించడంతోపాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని జివిఎంసి 83వ వార్డు టిడిపి ఇన్‌చార్జి బొడ్డపు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం విజయ రామరాజుపేట, ఎఎంసి కాలనీలో భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిట్ల రాజు, ఎస్.భానుచందర్, బొమ్మల దేవి, షేక్ రియాజ్, అన్నపూర్ణ, దుర్గ భవాని, అమ్మాజీ, శేఖర్, కృష్ణ, గాంధీ, రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 3న విశాఖలోని సింహాద్రి అప్పన్న దర్శనానికి హాజరవుతున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్చార్జిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ, అనుబంధ సంస్థల కమిటీ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు. 3వ తేదీ ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారని, 12.30 గంటలకు సింహాచలం దేవస్థానానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, అనంతరం ఒంటి గంటకు బయలుదేరి 1.25 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొని హైదరాబాద్‌కు బయలుదేరుతారని నాగ జగదీష్ తెలిపారు.

సబ్బవరం : ఈ నెల 3న చంద్రబాబు నాయుడుకి ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని టిడిపి అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు కోరారు. నియోజకవర్గ పరిధిలోని టిడిపి శ్రేణులు చంద్రబాబు నాయుడుకి ఘనంగా స్వాగతం పలకాలన్నారు.

3న వికలాంగులకు బస్‌పాస్‌లు జారీ

ప్రజాశక్తి-చోడవరం : వికలాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద వికలాంగుల సదస్సు నిర్వహించనున్నట్లు మండల వికలాంగుల సంఘం అధ్యక్షులు దుగ్గిరాల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు వద్ద గాజువాక డిపోకు చెందిన ఆర్టీసీ అధికారులు వికలాంగులకు బస్సు పాసులు అందజేస్తారని పేర్కొన్నారు. బస్ పాస్‌లు కావాల్సిన వారు సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, వంద రూపాయలు రుసుము తీసుకురావాలని ఆయన కోరారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - కసింకోట : మండలంలోని లాలం కొత్తూరులో కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు శివ, శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం

అనకాపల్లి ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-నక్కపల్లి:గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ వెంకట సత్యవతి అన్నారు. మండలంలోని పెదదొడ్డిగల్లులో రూ.25 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే గొల్ల బాబురావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం బోదుగులలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రహదారుల నిర్మాణానికి, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల విజయలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, పార్టీ నాయకులు గొర్ల నాగ అప్పలరాజు, బొల్లం బాబ్జి, చంద్రరావు, గురునాథరావు, పల్లా చిన్నబ్బాయి, అల్లు రమణ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

పాయకరావుపేట:మండలంలోని కందిపూడి గ్రామంలో ఐదు లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు వెంకట సత్యవతమ్మ పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంక్షేమము, అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఈ మేరకు ఎంపీ వెంకట సత్యవతి ఐదు లక్షల మినీ వాటర్ ట్యాంకు, సీసీ రోడ్డుకు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, వైయస్సార్ పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగత శ్రీను, సర్పంచ్ ధర్మాజీ, పిఏసిఎస్ అధ్యక్షులు రాజేష్ ఖన్నా, బీసీ నాయకులు పక్కుర్తి లోవ కుమార్, రామాల శ్రీను, ఎంపీటీసీలు కొంతం నరేష్ పాల్గొన్నారు.



రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు



దుప్పట్లు అందజేస్తున్న టిడిపి నాయకులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినతీన్నార్ల గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, టిడిపి నేత మీగడ సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం .150 పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురుందాసు నూకరాజు ,కొప్పిశెట్టి బుజ్జి, కల్లేపల్లి బాబ్జి రాజు, కర్రి వెంకట సత్యనారాయణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



సత్తిబాబును సన్మానిస్తున్న బూడి

సత్తిబాబుకు బూడి సన్మానం

ప్రజాశక్తి - చీడికాడ: ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ పొందిన గాడి సత్తిబాబుని మంత్రి బూడి ముత్యాల నాయుడు తమ నివాసం వద్ద సన్మానించి ప్రశంసించారు. చీడికాడ మండలం బయలుపూడి గ్రామానికి చెందిన గాడి సత్తిబాబు నాగార్జున యూనివర్సిటీలో కోసేమ ఆధునిక శతక సాహిత్యం" పై పరిశీలన చేసినందుకుగాను యూనివర్సిటీ నుండి డాక్టరేట్ లభించింది. గ్రామ యువత సత్తిబాబును అభినందించారు.

అందరి సహకారంతోనే అఘాయిత్యాల నియంత్రణ

ప్రజాశక్తి-రావికమతం:సమాజంలో మహిళలపై అగత్యాలు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్, చోడవరం శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ తెలిపారు. మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎటువంటి అరాచకాలు, దాడులు, వివక్ష, అత్యాచారాలు లేనిదిగా ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ ప్రత్యేకమైన చర్చలు జరగాలన్నారు. నవంబర్ 27వ తేదీ నుండి డిసెంబరు 5వ తేదీ వరకు మహిళల రక్షణపై గ్రామ గ్రామాన వారోత్సవాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మి నాయుడు, జగ్గారావు, ఎంపీడీవో వెంకన్న బాబు, వెలుగు ఏపీఎం తిలక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు విశాలాక్షి, సిసి కృష్ణ పాల్గొన్నారు.



రావికమతంలో మానవహారం చేపడుతున్న మహిళలు

కోటవురట్ల: హింసకు వ్యతిరేకంగా డిఆర్డిఏ పిడి శోభ రాణి వెలుగు సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిపిఎం సంజయ్, వరప్రసాద్, ఏపీఎం రమణకుమారి పాల్గొన్నారు.



మొక్కలు తొలగిస్తున్న ఎస్ఐ

రోడ్డు పక్కన మొక్కల తొలగింపు

ప్రజాశక్తి -రావికమతం:రోడ్డుకిరువైపులా పేరుకు పోయిన మొక్కలను తొలగించడం జరుగుతుందని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో మేడివాడ నుండి బాదనపాడుకు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు భారీగా పెరిగి పోవడంతో జెసిబి సహాయంతో తొలగిం చామన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - చీడికాడ:ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామారావు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆటో ఓనర్లకు, డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఆటోలో అధిక లోడుతో ప్యాసింజర్లను ఎక్కించకూడదని, సిట్టింగ్ నిబంధన ప్రకారం ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆడుదాం.. ఆంధ్రా' క్రీడా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ:మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి వివిధ రకాల కిట్లను శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీలకు సంబంధించిన పరికరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, జడ్పిటిసి లాలం శారద వరలక్ష్మి జానకిరామ్, వైసీపీ పార్టీ అధ్యక్షులు గొల్లవెల్లి రాజుబాబు చేతుల మీదుగా కార్యదర్శులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఒపిఆర్డి కామేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట :ఆడుదాం ఆంధ్రలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను సచివాలయాల వారిగా ఎంపీడీవో సువర్ణ రాజు, మండల ఇన్చార్జ్ గేదెల శేషు, ఏపీ స్పోర్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాడ శ్రీనుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సువర్ణ రాజు మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రలో ఆడి ఉత్తమ క్రీడాకారులుగా ప్రతిభ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోరుకొండ అప్పలనాయుడు, బుచ్చయ్యపేట పిఏసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చీడికాడలో పంపిణీ చేస్తున్న కిట్లు



నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది:బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట, ఎల్‌బిపి అగ్రహారం శ్రీ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. శ్రీ కామాక్షి విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా కడియం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అలమండ నాగేంద్ర ప్రసాద్, కార్యదర్శిగా అలమండ ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా నక్క గణేష్, కోశాధికారిగా నక్క లక్ష్మి శంకర్, మెంబరుగా తగరంపూడి సోమేష్, శ్రీనివాస్ రావు, రాజు, అలమండ సతీష్, నక్క నరసింహారావు, అలమండ సంతోష్, నక్క సతీష్, అప్పల బత్తుల నరసింహమూర్తి, అలమండ శ్రీనుబాబు, గానుగుల సంతోష్, అలమండ మోహన్ కుమార్, ధవర్ సింగ్ శీను తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వం అందించే పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు.

జీవిత బీమాతో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి- గొలుగొండ: తమ కుటుంబం కోసం ప్రతి ఒక్కరూ జీవిత బీమా కలిగి ఉండాలని గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకట గిరిబాబు సూచించారు. శుక్రవారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో జరిగిన జీవిత బీమా అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల కోసం అతి తక్కువ సొమ్ముకే జీవిత బీమా పొందే సౌకర్యం ఉందన్నారు. ప్రజలంతా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐపిపిబి రీజనల్ మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ, సాధారణ ప్రజలందరికీ జీవిత భీమా అందు బాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం తక్కువ మొత్తానికే పోస్టల్ శాఖ ద్వారా బీమా సౌకర్యాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన జీవిత బీమా పాలసీల గురించి ప్రజలకు ఆయన వివరించారు. చీడిగుమ్మల గ్రామానికి చెందిన గోవింద్ 6 నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడని, ఆయన పోస్టల్ శాఖలో 399 రూపాయలకు ప్రమాద బీమా పాలసీ పొందడంతో ఆయన కుటుంబ సభ్యులకు భీమా సొమ్ము 10 లక్షల చెక్కును పోస్టల శాఖ ఆధ్వర్యంలో జడ్పిటిసి గిరిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ ఏడి రాజేష్, ఐపిపిబి మేనేజర్ శ్రీదేవి, నర్సీపట్నం రీజనల్ మేనేజర్ రవికుమార్, పోస్టల్ ఇన్స్పెక్టర్ కుమార్, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు కె సత్తిబాబు, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న జెడ్పిటిసి గిరిబాబు, అధికారులు

పాఠ్యపుస్తకాల పంపిణీపై ఆరా

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాల పంపిణీపై శుక్రవారం జిల్లా పాఠ్య పుస్తకాల మేనేజర్ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి విద్యాశాఖ అధికారి రామారావుతో కలిసి పాఠశాలలను సందర్శించారు. పుస్తకాల పంపిణీపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 జోష్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సరితా దేవి పాల్గొన్నారు.



పుస్తకాలు పరిశీలిస్తున్న మేనేజర్

బస్ యాత్రను జయప్రదం చేయాలి : ధర్మశ్రీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలోని వడ్డాదిలో ఈనెల 5న చేపట్టే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ధర్మశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రజల బహిరంగ సభకు హాజరయ్యే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

వరి పంటల పరిశీలన

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని రైతులు కోసిన వరి చేనుపై జాగ్రత్త వహించాలని ఏవో ఎ.కృష్ణవేణి సూచించారు. మండలం లో జి.కొత్తపల్లి, చుక్కపల్లి తురువోలు, అజ్జగిరి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారిని పర్యటించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. తుఫాన్ కారణంగా కోత కోసి ఎండబెట్టిన వరి పంటలను వీలైనంత త్వరగా కుప్పలుగా వేసుకోవాలని, వీటిని సురక్షితమైన ప్రాంతాల్లో పెట్టుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఆమె తెలిపారు.


పరిశీలిస్తున్న ఎఒ


నృత్యం చేస్తున్న విద్యార్థులు


కళారూపాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఘనంగా ఉక్కు చిల్డ్రన్స్ ఫెస్టివల్

ఉక్కునగరం అంబేద్కర్ కళాక్షేత్రంలోని జ్యోతి బాలవిహార్ ఆవరణలో విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఉక్కునగరం చిల్డ్రన్స్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. 74 ఈవెంట్స్‌లో సుమారు రెండు వేల మంది పిల్లలు పాల్గొంటున్న ఈ వేడుక ఆద్యంతం ఉత్సాహంగా సాగింది.


కళారూపాలను తిలకిస్తున్న చిన్నారులు


వీక్షకుల మెప్పు పొందిన ప్రదర్శన


స్టాల్ వద్ద నరెడ్కో ప్రతినిధులు

ఆకట్టుకున్న నరెడ్కో ప్రాపర్టీ ఎక్స్‌పో

వేలాదిగా తరలివచ్చిన నగరవాసులు - గృహాలు, స్థలాలు, ప్లాట్లు కొనేందుకు ఆసక్తి

ప్రజాశక్తి - పిఎం.పాలెం విశాఖ నగరంలో ఇల్లు, ఇంటి స్థలానికి ఎంత డిమాండ్ ఉందో అందరికీ తెలిసిందే. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ మహా నగరంలో గృహం కోసం ఎందరో కలలు కంటున్నారు. ఇల్లు, స్థలం, ప్లాట్లు కొనుక్కోవాలని ఆలోచనలు చేస్తున్నారు. అలాంటి వారంతా శుక్రవారం పిఎం.పాలెంలో వాలిపోయారు. వైజాగ్ కన్వెన్షన్‌లో నరెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన ప్రాపర్టీ ఎక్స్‌పోకు వేలాదిగా తరలివచ్చారు. రియల్ ఎస్టేట్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన డెవలపర్స్ అంతా ఒకే వేదికపైకి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ ప్రాపర్టీ షో శని, ఆదివారాల్లోనూ కొనసాగనుంది. ఈ రియల్ షోను వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ప్రముఖ ఆడిటర్ జీవీ, నరెడ్కో అధ్యక్షులు జి.చక్రధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు రియల్ ఎస్టేట్ సంస్థలు ఏర్పాటు చేసిన 70 స్టాల్స్‌ను ప్రారంభించి పరిశీలించారు.


వేలాదిగా తరలి వచ్చిన వినియోగదారులు

పాల్గొన్న సంస్థలు

ఈ ఇంటర్నేషనల్ ప్రాపర్టీ షోలో స్కై పార్క్, హాసిని, సిరి వెంకటేశ్వర డెవలపర్స్, భూమాత, ప్రకృతి, కర్లాన్, హనీ గ్రూప్, ఫ్లోరా, సుఖీభవ, శ్రీ రాజశ్రీ కన్‌స్ట్రక్షన్స్, నితీష్ బిల్డర్స్, సెయిల్ సెక్యూరిటీ స్టీల్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు పాల్గొన్నాయి. ఈ షో విజయవంతం వెనుక నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు జి.చక్రధర్, నార్త్ జోన్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, సెక్రటరీ డి.పాపారావు, విశాఖ అధ్యక్షులు నాగ కుమార్, కుమార్ ఉన్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న తిరుమల స్టీల్స్ ఎమ్‌డి రామ్‌జీ తదితరులు

తక్కువ ధరలకే లభ్యం : స్కై పార్క్ డైరెక్టర్ విద్యాసాగర్

లగ్జరీ సౌకర్యం, ఎఫెక్టుల్ ప్రాసెసింగ్ కలిగిన విశాలమైన ఫ్లాట్స్‌ను తక్కువ ధరలకే విక్రయిస్తున్నట్లు స్కై పార్క్ సంస్థ డైరెక్టర్ బి.విద్యాసాగర్ తెలిపారు. తాము రూపొందించిన ఫీచర్‌ను సౌత్ ఏషియాలో మరెవ్వరూ రూపొందించలేదన్నారు. 35 ఎకరాల సువిశాలమైన స్థలంలో 1040 అపార్టుమెంట్లకు ప్రణాళిక రూపొందించామన్నారు. గీతం, గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలు, పలు ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు సమీపంలో స్కై పార్కు ఆపార్టుమెంట్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. తమ అపార్టుమెంట్‌లో 1500 స్కేర్ ఫీట్, 2700 స్కేర్ ఫీట్ వరకూ ప్లాట్స్ ఉన్నాయని తెలిపారు. ఇరవై ఒకటో ఫ్లోర్‌లో ఏడు టవర్లును కలుపుతూ ఒక వాకింగ్ లైన్ ఏర్పాటు చేశామని, టెర్రస్ మీద పార్కును అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.



నమ్మకంతో కూడిన రియల్ ఎస్టేట్ షో

- నరెడ్కో అధ్యక్షులు జి చక్రధర్

'ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులూ పొందిన నమ్మకమైన ప్రాపర్టీలను ప్రజలకు ఈ షో ద్వారా అందిస్తున్నాం. ప్రస్తుతం మహా విశాఖ నగరం అన్ని రకాల వసతులతో కూడిన ఆర్థిక రాజధానిగా, పారిశ్రామికవాడగా గుర్తింపునొందింది. ఇండస్ట్రీస్, ఎస్ఇజెడ్, ఫార్మా రంగానికి కేంద్ర బిందువుగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాపర్టీ షోను విశాఖ ద్వారా అన్ని తరగతుల ప్రజలకూ అందుబాటులోకి తీసుకొచ్చాం' అని చక్రధర్ అన్నారు.

